# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 43 జూలై - 2022 సంచిక -12

## దేవుని సువర్తమానములోని శక్తి - 2

యేసుక్రీస్తు సువార్తను నమ్ము ప్రతి వానిని రక్షించుటకు దేవుని శక్తియై యున్నదను అంశమును మనము గమనించు చున్నాము. దేవుని సువార్తలో అతి ప్రాముఖ్యమైన మూడు సంగతులున్నవి. దేవుని వర్తమానము శక్తితో నిండుకొని యున్నది. దేవుని సువార్త పురుషులను, స్త్రీలను తమ పాపముల నుండి రక్షించు నిమిత్తము ఉద్దేశించ బడినది. ఈ దేవుని వర్తమానము వలన రక్షింపబడవలెనంటే మానవుడు దానిని విశ్వసించవలెను.

పాపముయొక్క ఘోరస్థితిని మానవులు ఎరుగవలెను. పాపము మానవులను ఖచ్చితముగా శిక్షకు పాత్రులనుగా చేయును: "పాపము వలన వచ్చు జీతము మరణము" అని దేవుని గ్రంధము బోధించుచున్నది (రోమా 6:23). కాని రక్షణ పొందిన వాడు నీతిమంతుడని తీర్చబడును. "కాబట్టి ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమంతులుగా తీర్చబడి మరి నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము" అని రోమా 5:9లో పౌలు వ్రాసెను. పాపము నుండి నీతిమంతుడని తీర్చబడిన వాడు దేవునిచే క్షమింపబడిన వాడు పాపము యొక్క క్రయధనమును ఇచ్చుట

ద్వారా లేక పాపుల కొరకు మరణించుట ద్వారా యేసుక్రీస్తు ఈ విమోచనను మనకు సాధ్యపరచెను. ఏలయనగా మన మింక బలహీను లమై యుండగా క్రీస్తు యుక్త కాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను.

మానవుని రక్షణ దేవుని వలన ఎట్లు సంకల్పించబడెనో అట్లే దేవుని కుమారుని రక్తము ద్వారా మానవులకు రక్షణ అందియ్యబడుచున్నది. గనుక అది మనుష్యులకు సువార్త ద్వారా బయలుపరచబడి యున్నది. దేవుని సువర్త మానము రక్షణ వర్తమానమై యున్నది. పాపము నుండి రక్షణ నందించే వర్తమానము అది. ఈ సంగతులను మనసులో యుంచుకొని రోమా 1:16ను మరియొకసారి జ్ఞాప కము తెచ్చుకొందుము: "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి... రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది".

దేవుడు శక్తిగల దేవుడా? ఆయన భూమ్యాకాశములను సృజించెను కాదా? యేసుక్రీస్తును మృతులలో నుండి లేపెను కాదా? ఎఫెసులో యున్నవారు పాపములలో మరణించి యుండగా క్రీస్తునందు వారికి నూతన జీవితముననుగ్రహిం చెను కదా? దేవుడు శక్తిగల దేవుడయిన యెడల, మానవులను పాపము నుండి రక్షించుటకు సువార్త ఆయన శక్తి అయినయెడల, రక్షించు ఆ దేవుని శక్తి క్రీస్తు సువార్త ద్వారా మానవులకు అందియ్యబడుచున్నది. గనుక నేటి మానవులు ఈ గొప్ప సత్యమును నమ్మవలెను. ఎందువల నంటే నమ్ము ప్రతివానికి రక్షణ కలుగు జేయుటకు సువార్త దేవుని శక్తి అయ్యున్నదని పౌలు చెప్పుచున్నాడు.

గనుక సువార్తలోని మూడవ అంశమునకు ఇది మనలను నడిపించు చున్నది. అదేమంటే దేవుని సువార్త వలన రక్షింపబడవలెనన్న లేక జీవింపబడవలెనన్న ఆ సువర్తమాన మును మానవులు విశ్వసించవలెను.



రోమా 10:10లో మనుష్యుడు హృదయములో విశ్వసించును అని వ్రాయబడినట్లు మనము కనుగొన గలము. ఒకడు రక్షించు క్రీస్తు సువార్తను వినినప్పుడు అతడు రెండింటిలో ఒక దానిని చేయవచ్చును : 1) అతడు తన హృదయములో సువార్తను విశ్వసించవచ్చును లేదా 2) తన హృదయములో దానిని విశ్వసించ లేకపోవచ్చును. విశ్వాసము లేని హృదయమును గూర్చి బైబిలు హెబ్రీ 3:12లో చెప్పుచున్నది.

ఒకని జీవితములో దేవుని శక్తియైన సువార్త పనిచేయు నిమిత్తము విశ్వాసము సహాయము చేయును. దేవుని శక్తిని అవిశ్వాసము నిరర్థకము చేయును. అవిశ్వాసము వలన ఒకడు నశించిపోవు స్థితిలో యుండును. నమ్మనొల్లని వానికి శిక్ష విధించబడు నని యేసు చెప్పెను (మార్కు 16:16). యేసు తన అపొస్తలులు సర్వలోకము నకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించవలెనని ఒక గొప్ప ఆజ్ఞ నిచ్చుచూ ఈ మాటలను పలికెను. మానవులను పాపము నుండి రక్షించే దేవుని శక్తి సువార్తలో యున్నదను గొప్ప సత్యమును మానవులు గ్రహించ గలిగినప్పుడు సహృదయ తతో వారు దానిని విశ్వసించగలరు. అయితే సువార్తను నమ్ముట అంటే అర్థమేమిటి? సువార్తను నమ్ముట అంటే సువార్తలో ఇమిడియున్న వాస్తవ ములను, అనగా క్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థానముల వాస్తవము లను హృదయపూర్వకముగా అంగీకరించుటయని అర్థము. అంతే కాకుండా, సువార్తను నమ్ముట యనగా సువార్త యిచ్చు ఆజ్ఞలు సరియైనవి, అతనికి వర్తించునవియని ఒకడు అంగీకరించుట యని అర్థము. సువార్తకు విధేయులగుటను గూర్చి లేఖనములలో చెప్పబడిన ప్రతిసారి కూడ, సువార్తలో విధేయతను కోరు ఆజ్ఞలున్నవని విశదమగుచున్నది.

సువార్త వలన రక్షింపబడవలె నంటే మానవులు విశ్వసించి, విధేయత

చూపు ఆజ్ఞలు దానిలో యున్నవి. నమ్ము ప్రతివానికి రక్షణ కలుగుజేయుటకు సువార్త దేవుని శక్తియై యున్నదను సంగతిని మరల మీకు జ్ఞాపకము చేయుచున్నాను. దేవుని శక్తియైన ఈ సువార్త మానవులను మారుమనస్సు పొందవలెనని ఆజ్ఞాపించుచున్న యెడల, రక్షింపబడు నిమిత్తము వారు మారుమనస్సు తప్పక పొందవలెనని ఆజ్ఞాపించుచున్న యెడల, రక్షింపబడు నిమిత్తము వారు మారుమనస్సు తప్పక పొందవలెను. దేవుని సువార్త మారుమనస్సును ఖచ్చితముగా ఆజ్ఞాపించుచున్నది. "ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ.కా. 17:30; లూకా 20:46, 47; అపొ.కా. 2:38). గనుక పాప క్షమాపణ పొందవలెనంటే మానవులు మారుమనస్సు పొందవలెను.

సువార్త యిచ్చు మరియొక ఆజ్ఞయేమంటే మానవులు క్రీస్తునందలి తమ విశ్వాసమును నోటితో ఒప్పుకొనవలెను. యేసేప్రభువని, రక్షకుడని, రక్షణ కలుగునట్లు ఒకడు నోటితో ఒప్పుకొనును (రోమా 10:10). సువార్తకు విధేయత చూపుటలో ఇది ఒక భాగము. అంతే కాకుండా దేవుని శక్తియైన ఈ సువార్త మానవులు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించుచున్నది (మార్కు 16:16). బాప్తిస్మము చాల ప్రాముఖ్యమైనది ఏలయనగా ఈ ఆజ్ఞకు లోబడుటద్వారా ఒకడు శుద్ధిచేయు, క్షమించు విమోచించు క్రీస్తు రక్తము దరికి చేరుకొనును (రోమా 6:3, 4).

మంచి వర్తమానముతో నిండుకొనిన శక్తివంతమైన సువార్తను దేవుడు మనకిచ్చియున్నాడు. గాని నీవు నేను ఈ వర్తమానమును నమ్మితేనేగాని, దాని ద్వారా దేవుడు చేసిన వాగ్దానములు ఫలింపనేరవు. సువార్త యిచ్చు ఆజ్ఞలకు లోబడితేనే గాని సువార్త యిచ్చు రక్షణను మనము పొందలేము.



క్రీస్తు సువార్త దేవుని సువర్తమానమై యున్నది. నేను సువార్తను నమ్ము రీతిగనే మిత్రులారా, మీరును నమ్మండి. మీ పూర్ణ హృదయముతో క్రీస్తు సువార్తను నమ్మండి. ఏలయనగా సువార్తలోని వాస్తవములు, వాగ్దానములు, ఆజ్ఞలలో మీకుగల విశ్వాసము ద్వారానే దేవుని గొప్పశక్తి మీకు మేలు కలుగుటకై మీ ఆత్మలపై పనిచేయును. అది ఇప్పటికి, ఎల్లప్పటికి మీకు మేలుకరముగా యుండును.

పాపము నుండి నిన్ను రక్షించుటకు సర్వశక్తిగల దేవుడు యొద్ద ఒక సాధనమున్నది. ఈ శక్తి ఒక మంచి వర్తమానములో, సువార్తలో దాచబడి యున్నది. దానిని నమ్ము ప్రతివాని యొద్దకు ఆశక్తి చేరుకొనగలదు. అన్ని జనాంగముల వారికి, అన్ని జాతుల వారికి, అన్ని కులస్థులవారికి దానిని వారు నమ్మిన యెడల ఆ శక్తి చేరుకొనగలదు. ధనికులకు, ధనహీనులకు అది చేరుకొనగలదు; విద్యావంతులకు, విద్య లేనివారికి అది చేరుకొనగలదు; రోగులకు, ఆరోగ్యముగలవారికి సువార్తలోని శక్తి చేరుకొనగలదు; నిరాశ నిస్పృహ చెందినవారికి, ఆనందముతో మునిగి యున్నవారికి ఆశక్తి చేరుకొనగలదు. జాగ్రత్త గలవారికి, జాగ్రత్త లేనివారికి కూడ దేవుని సువార్తశక్తి చేరుకొనగలదు. అట్లు చేరుకొనుట ద్వారా సువార్త ఒకని హృదయములోనికి చేరుకొనును. మనుష్యుని హృదయము అప్పుడు సువార్తలోని సత్యములకు, ఆజ్ఞలకు, వాగ్దానములకు విశ్వాసముతో దేవునివైపు చేరుకొనిన యెడల, అతని పాపములు క్షమించబడును. అప్పుడతడు క్షమించబడిన వాని సంతోషమును, శాంతిని, పరలోక నిరీక్షణను, నిజముగా అనుభవించ వీలగును.

ఈ వర్తమానము చదువుచున్న మిత్రుడా, సువార్త యెడల నీ హృదయ పరిస్థితి యెట్లున్నది? నీవు నీ పాపముల నుండి విడుదలపొంద గోరుచున్నావా? క్రీస్తుతోను, క్రీస్తు

శిష్యులతోను ఆనందింపగోరుచున్నావా? అయితే ఈనాడే క్రీస్తును నమ్ముకొనుము, పాపములను విడనాడుము, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము.

మీరు బాప్తిస్మము పొందుట ద్వారా సువార్తకు విధేయులు కాగోరుచున్న యెడల వెంటనే మీకు సమీపములో యున్న క్రీస్తు సంఘమును దర్శించండి. లేదా మీ కోరికను మాకు వెంటనే వ్రాసి తెలియ పరచండి. సువార్తకు విధేయులగుటకు వెనుకాడకండి!!

క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి (రోమా 16:16).

## మనము ప్రభువును ఎంతగా ప్రేమించుచున్నాము?

''వారు భోజనము చేసిన తరువాత యేసు సీయోను పేతురును చూచి – యోహాను కుమారుడవైన సీమోను, వీరి కంటే నీవు నన్ను ఎక్కువగా ప్రేమించుచున్నావా? అని అడుగగా అతడు అవును ప్రభువా, నేను నిన్ను ప్రేమించుచున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను. యేసు – నా గొర్రె పిల్లలను మేపుమని అతనితో చెప్పెను'' (యోహాను 21:15).

### మనము మన బంధువుల కంటే ఎక్కువగా ప్రభువును ప్రేమించుచున్నామా?

మనం అలా చేసినట్లయితే మనం సువార్తకు లోబడకుండా వారిని అడ్డుకోనివ్వము. వారు అంగీకరించిన మతము సరైనదికాదని నిరూపించబడినపుడు మనం ఇష్టపూర్వకముగా దానిని విడిచిపెట్టడానికి సిద్ధపడతాము. ప్రభువు సంఘము యొక్క కార్యక్రమములకు వెళ్ళకుండా వారిని అడ్డుకోనివ్వము. యేసు చెప్పిన దానిని జ్ఞాపకము చేసికొనుడి – "తండ్రినైనను, తల్లినైనను నా కంటే ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాదు, కుమారునినైనను, కుమార్తెనైనను నా కంటే ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాదు" (మత్తయి 10:37).

### మనం ధనము కంటే ఎక్కువగా ప్రభువును ప్రేమించుచున్నామా?

మనం అలా చేసినట్లయితే, మనం జీవించడం కోసం ప్రధానమైనదిగా డబ్బును కుప్పలుగా వేయము. మనం ప్రభువుకు ఉదారముగా ఇచ్చెదము (2 కొరింథీ 8:1–5). ప్రభువు చెప్పిన దానిని జ్ఞాపకము చేసికొనుడి – "ధనాపేక్ష సమస్తకీడులకు మూలము" (1తిమోతి 6:10).

### మనము సుఖము కంటే ఎక్కువగా ప్రభువును ప్రేమించుచున్నామా?

మనం అలా చేసినట్లయితే, క్రీస్తుపై మన ప్రభావమును ఏది అడ్డగించునో, ఏది దెబ్బతీయునో దానిలో మనం నిమగ్నులమై యుండము. అపాయకరమైన కాలములలో ప్రభువు చెప్పిన దానిని జ్ఞాపకము చేసికొనుడి – "దేవుని కంటే సుఖానుభవము నెక్కువగా మనుష్యులు ప్రేమింతురు" (2 తిమోతి 3:1–4).

### మనము మనుష్యుల ప్రశంసల కంటే ఎక్కువగా ప్రభువును ప్రేమించుచున్నామా?

మనం అలా చేసినట్లయితే, ప్రభువు కొరకు, సరైనదాని కొరకు మనం ఒంటరిగా అయినా సరే నిలువబడడానికి సిద్ధపడుదుము (2 తిమోతి 4:16,17). "అయినను అధికారులలో కూడ అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి గాని, సమాజములో నుండి వెలివేయబడుదుమేమోయని పరిసయ్యులకు భయపడి వారు ఒప్పుకొనలేదు. వారు దేవుని మెప్పు కంటే మనుష్యుల మెప్పును ఎక్కువగా ఆపేక్షించిరి" (యోహాను 12: 42,43).

ప్రభువు మన ప్రేమకు అత్యున్నతుడు (మత్తయి 22:37). మనం పాడుట నేర్చుకుందాం మరియు దాని అర్థమును తెలుసుకుందాం "నిన్ను ఎక్కువగా ప్రేమించెదం ఓ క్రీస్తూ నిన్ను ఎక్కువగా ప్రేమించెదం"

– వెండల్ విన్‌క్లైర్

# విత్తనములో నిరీక్షణ యున్నది

ఏదెనువనములో ఆదాము పాపము చేసినప్పుడు అతడు ఆత్మీయ ముగా మృతిబొందెను (రోమా 5:12). మానవజాతినంతయు అతనితో తీసికొనిపోయెను! ఇప్పుడు మనంద రము అతని పాప పర్యవసనాన్ని అనుభవించుచున్నాము. మరియు భౌతికంగా మనందరము మరణించు చున్నాము (1కొరింథీ 15:20-22).

ఇంతఘోరమైన మానవ విషాదము మధ్యలో దేవుడు పాప విడుదలకొరకైన వాగ్దానమును చేసారు (ఆది.కా. 3:15). పాతనిబంధన యంతటిలోను రాబోవుచున్న మెస్సీయను గూర్చి వందలాది ప్రవచనములు చేయ బడ్డాయి. ఆయన వచ్చి మానవ పాప పరిహారమును చెల్లిస్తాడు. ఈ ప్రవచ నములన్నియు యేసునుగూర్చి చేయ బడినవి. మనలను దేవుని యొద్దకు తిరిగి చేర్చుటకు ఆయన సిలువపై మరణిస్తారు. తదుపరి మనందరం భయపడు భౌతికమరణము నుండి తప్పించుకొను మార్గమును కూడా మనకు యిస్తారు (హెబ్రీ 2:14).

మానవజాతికంతకు రక్షకునిగా యుండు ఆయనను అబ్రాహాము సంతతి ద్వారా తీసికొనివచ్చుటకు దేవుడు ఏర్పాటుచేసుకున్నారు. "భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదింపబడును" (ఆది.కా. 12:3). క్రీస్తు పూర్వము 2000 సం॥లో చేయబడిన ఈ వాగ్దానము మొదలుకొని, దేవుడు ప్రజలకు పదే పదే రాబోవుచున్న ఆశీర్వాదమును గూర్చి, ప్రజలయొక్క పాపభారమును మోయువానిని గూర్చి జ్ఞాపకము చేయుచు వచ్చారు (యెషయా 53). ఆ వాగ్దానము అబ్రాహాము సంతతి వారికి మాత్రమే గాక, భూమిపైనున్న సమస్తజనాంగములకు వర్తించును. మానవాళికై దేవుడు చేసిన వాగ్దానమది.



**ఆ విత్తనము!**

గనుక ఆ యాశీర్వాదము ఎవరు? ఆ ప్రవక్తలకును దేవుడు అబ్రాహాముతో నీ సంతానమందు భూలోక వంశములన్నియు ఆశీర్వ దింపబడునని చెప్పి మీ పితరులతో చేసిన నిబంధనకును మీరు వారసులై యున్నారు. దేవుడు తన సేవకుని పుట్టించి మీలో ప్రతివానిని వాని దుష్టత్వము నుండి మళ్లించుట వలన మిమ్మునాశీర్వదించుటకు ఆయనను మొదట మీ యొద్దకు పంపెను" అని చెప్పెను (అపొ.కా. 3:25,26).

**ఈ అబ్రాహాము సంతతి యెవరు?**

సమస్త జనాంగములను ఆశీర్వదించు ఈ అబ్రాహాము సంతతి యేసుక్రీస్తే. "అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానము చేయ బడెను, ఆయన అనేకులను గూర్చి అన్నట్లు నీ సంతానములకును అని చెప్పక ఒకని గూర్చి అన్నట్లే, నీ సంతానమునకును అనెను. ఆ సంతానము క్రీస్తు" (గలతీ 3:15,16). గనుక ఆ సంతానము యేసుక్రీస్తే! ఆదాము పాపము చేయగా దేవుడు వాగ్దానము చేసిన స్త్రీ సంతానము ఈయనే! సాతాను యొక్క తలను చితుకగొట్టువాడును ఈయనే! (ఆది. కా. 3:15).

**ఆశీర్వాదము!**

ఈ సంతానము ద్వారా అబ్రాహాముకు కలుగు ఆశీర్వాద మేమిటి? బైబిలు ఇట్లు జవాబిచ్చు చున్నది: "దేవుడు విశ్వాసమూలముగా అన్యజనులను నీతిమంతులుగా తీర్చునని లేఖనము ముందుగా చూచి, నీ యందు అన్యజనులందరును ఆశీర్వదింపబడుదురని అబ్రాహాము నకు సువార్తను ముందుగా ప్రకటిం చెను" (గలతీ 3:8). సర్వలోకమునకు ప్రకటింపబడే సువార్తను గూర్చి ఇక్కడ చెప్పబడినది.

**అబ్రాహాము యొక్క ఆశీర్వాద మేమిటి?**

ఈలోకపాపమును తీసివేయు సంతానమును గూర్చిన వార్తయే సువార్త. ఆయన మనలను నీతిమంతులనుగా తీర్చును (రోమా 3:20; గలతీ 2:16). ఆయన తన రక్తము ద్వారా మనలను దేవునితో సమాధానపరచును (రోమా 5:10,11). ఈ రీతిగా ఆయన యందు విశ్వాసముంచి వారందరినీ యేసు దీవించునుచ మనం ఆయన సువార్తకు లోబడాలి. ఈ లోక పాపములను మోసికొనుపోవు దేవుని గొర్రెపిల్ల ఆయనే! (యోహాను 1:29).

**- రోజర్ డిక్సన్**

## రాజ్యమును వెదుకుట

“కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును” (మత్తయి 6:33).

సాధారణముగా బైబిలును చదువువానికి ‘‘రాజ్యము’’ అను పదము గందరగోళముగా అగుపడును. క్రొత్త నిబంధనలో ఆ పదము 140 సార్లకు పైగా వాడబడినది. మరీ ముఖ్యముగా సువార్తలలో ఆ పదము ఎక్కువ కనబడును. కొన్ని సందర్భాలలో రాజ్యము దాని ఆశీర్వాదములు భవిష్యత్తులో యున్నట్లుగుపడును. మరి కొన్నింటిలో అవి ప్రస్తుతములోనే యున్నట్లుగుపడును (మత్తయి 3:1,2; మార్కు 1:14,15; కొలస్స 1:13). కొన్ని యేసు తానే ఆ రాజ్యమై యున్నట్లుగుపడును (లూకా 11:20; 17:20,21) మరికొన్ని చోట్ల సంఘము, రాజ్యము అను పదములు ఒకదాని కొకటి వాడబడెను (మత్తయి 16:18,19). అయితే ఈ పదములను అర్థముచేసికొనుటకు తగినన్ని మార్గదర్శకసూత్రములు మనకున్నవి.

దేవుని రాజ్యము లేక పరలోక



రాజ్యము అను పదములు మానవ హృదయాల్లో దేవుని ఏలుబడిని సూచించును. ఈ పాలనకు గురుతుగా సంఘమున్నది. కాలాంతమందు భూమి మీద దేవునికి విధేయులైన వారు, క్రీస్తు సంఘసభ్యులైన వారు దేవునితో నిత్యరాజ్యము ననుభవించుటకు ఆయనకు అప్పగింపబడుదురు (1 కొరింథీ 15:24).

**క్రైస్తవులు దేవుని రాజ్యసభ్యులు :**

అయినను వారు ఈ లోక రాజ్యసభ్యులు. ఈలోక రాజ్యము యొక్క అవసరతలు దేవుని రాజ్యమునకు భిన్నముగా యుండవచ్చును. అట్టి సందర్భాలలో మన విశ్వసనీయత పరీక్షింపబడును. ఈలోకాన్ని గాక దేవునిని ఆయన రాజ్యమునే మనం ఎంచుకొనవలెను.

దేవుని రాజ్యములో ప్రవేశింపక ముందు మనం చెల్లించవలసిన మూల్యమును వెచ్చించుకొని దానిని చెల్లింపవలెను. “ఒకడు నీటిమూలము గాను, ఆత్మమూలముగాను జన్మించి తేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపబడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని” యేసు చెప్పెను (యోహాను 3:5). దేవుని రాజ్యములో ప్రవేశమును, దానిలో సభ్యత్వమును బాప్తిస్మము పొందిన వారికే పరిమితము చేయబడినది. బాప్తిస్మము ద్వారా దేవుని చిత్తానికి మనం లోబడుదుము మరియు ఆయనకు మన రాజుగా అంగీకరించుదుము. ఇవ్విధమైన విధేయతలేకుండా ఆయనచే పాలింపబడు వారము కాము.

**రాజ్యప్రవేశ మూల్యము హెచ్చయినదే**

దేవుని రాజ్యములో ప్రవేశించుటకు అభ్యంతరము కలుగజేయునదే దయినను దానిని మనం త్యాగం చేయాలి. “నీ కన్ను నిన్ను అభ్యంతరపరచిన యెడల దాని తీసి పారవేయుము. రెండు కన్నులు కలిగిన

నరకములో పడవేయబడుట కంటే ఒంటి కన్ను కలిగి దేవుని రాజ్యములో ప్రవేశించుట మేలు" (మార్కు9:47).

'మరియు పరలోక రాజ్యము మంచి ముత్యములను కొన వెదకుచున్న వర్తకుని పోలియున్నది. అతడు అమూల్యమైన ముత్యమును కనుగొని తనకు కలిగినదంతయు అమ్మి ఆ పొలమును కొనును'' (మత్తయి 13:45). రాజైన యేసుక్రీస్తు చిత్తానికి సంపూర్తిగా లోబడ నిశ్చయించుకొనని యెడల అట్టి విధేయత అసాధ్యమగును. "మీరు మార్పు నొంది బిడ్డల వంటి వారైతేనే గాని పరలోక రాజ్యములో ప్రవేశింపలేరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను'' (మత్తయి 18:3).

ఇట్టి హృదయం మార్పు ప్రవర్తనలో మార్పును తెచ్చును. "అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి, జారులైనను విగ్రహారాధకులైనను, వ్యభిచారులైనను, ఆడంగితనముగలవారైనను, పురుషసంయోగులైనను, దొంగలైనను, లోభులైనను, త్రాగుబోతులైనను, దూషకులైనను, దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారుసులుకానేరరు" (1 కొరింథీ 6:9-11).

రాజ్యములో సభ్యులమై యుండుడి అనగా మనకు దాని అర్థమేమిటి? అనగా వానిని గొప్పగా మనం ఎంచుకోవాలి. క్రీస్తు రాజ్య సభ్యత్వము బహువిలువైనది. మనం దానికి సంపూర్ణులుగా విధేయులు కావాలి, మన తలంపులు, కోరికలు, అభిలాషలు అన్నదానికి లోబడాలి అట్టి సమర్పణ నుండి విరమించుకోకూడదు. దాని ద్వారా కలిగే ప్రయోజనములెంతో మెండుగనుక క్రీస్తు రాజ్యము నుండి వెనుదిరుగకూడదు.

- ఏన్సిల్ జెంకిన్స్



# సంఘము యొక్క దైవిక ఆరంభము

అనంత జ్ఞానియైన దేవుని మదిలో సంఘము ఉద్భవించెను. అట్టి సంస్థను మానవుడు సృజించియుండలేడు. "తమ మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదనియు మనుష్యులు తమ ప్రవర్తన యందు సన్మార్గములో ప్రవర్తించుట వారి వశములో లేదనియు" యిర్మియా ప్రవక్త ప్రకటించాడు (యిర్మియా 10:23). యేసు యొక్క అపొస్తలులు ఆయన పాదముల యొద్ద కూర్చుని 3 1/2 సంవత్సరములు నేర్చుకొనినను సంఘస్థాపనమును గూర్చి వారు ఇంకా గ్రహించుకొననేలేదు. ఆయన పరమున కారోహణము కాకముందు "ప్రభువా యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా?'' యని అమాయకంగా అడిగారు (అపొ.కా. 1:6). అందుకాయన, "కాలములను, సమయములను తండ్రి తన స్వాధీనముందుంచుకొనియున్నాడు, వాటిని తెలిసికొనుట మీపనికాదు. అయినను పరిశుద్ధాత్మ మీమీదికి వచ్చునప్పుడు మీరు శక్తి నొందెదెరు. గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంతముల వరకును నాకు సాక్షులై యుందురుని వారితో చెప్పెను.

పరిశుద్ధాత్ముడు వారి మీదికి వచ్చినపుడు (అపొ.కా. 2:1-4). వారందరు ఏకమనస్సుతో సువార్తను బోధించుచు జనసమూహములకు బాప్తిస్మమిచ్చుచుండిరి, "మరియు రక్షణ పొందుచున్నవారిని ప్రభువు అనుదినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను" (అపొ.కా. 2:42-47).

మానవుని జ్ఞానముపై ఆధారపడి సంఘము స్థాపించబడలేదు. పరిశుద్ధాత్ముడు వారికేమి బయలు పరిచాడో దానినే అపొస్తలులు బోధించారు. క్రీస్తు యొక్క పునరుత్థానము తరువాత వచ్చిన మొదటి పెంతెకొస్తు నాడు సంఘము స్థాపించబడెను.

కేథలిక్కులు, మెథడిస్టు, లూథరన్, బాప్టిస్టు మొదలగు సంఘములు క్రీస్తుసంఘము స్థాపించబడిన కొన్ని శతాబ్ధముల తరువాత ఉత్పన్నమైనవి. దీనిని బట్టి మనం యేమి గ్రహించుకోవాలి? వివిధ కాలములలో వివిధ వ్యక్తులచే స్థాపించబడిన సంఘములు, క్రీస్తు సంఘము ఒక్కటేకాదు. వాటిని గూర్చి క్రొత్తనిబంధనలో మనం ఎక్కడా చదువలేము.

అంతేకాదు గొప్ప నిర్మాణకుడైన యేసుక్రీస్తుచే సంఘము యొక్క నమూనా, స్థాపన జరిగెను. "మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదునని ఆయన చెప్పెను" (మత్తయి 16:18). నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు అని పేతురు ఒప్పుకొనగానే, ఆ పునాది పై బండ పై క్రీస్తు తన సంఘమును నిర్మింతునని వాగ్దానము చేసెను (మత్తయి 16:18). మరియు ''పాతాళ లోకద్వారములు దాని యెదుట నిలువనేరవని'' ఆయన చెప్పెను". "యోహోవా యిల్లు కట్టించని యెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్ధమే'' యని జ్ఞానియైనవాడు వ్రాసెను (కీర్తన 127:1). అది స్థాపించబడిన తేదీ ఎట్లో దాని నిర్మించిన వాని సంగతి కూడ అట్లే. ఏదైనా సంఘము మానవునిచే నిర్మించబడితే అది నిజమైన క్రీస్తు సంఘముకాదు!

ఇంకా యేమంటే సంఘము యెరూషలేములో స్థాపించబడి యుండవలెను. ఏలయనగా "సీయోనులో నుండి ధర్మశాస్త్రము, యెరూషలేము నుండి యెహోవా వాక్కు బయలు వెళ్లునని" ప్రవక్త పలికాడు (యెషయా 2:2-3). గొప్ప అధ్యాయమగు అపొ. కార్యములు రెండవ అధ్యాయము యెరూషలేములో సంఘము స్థాపించబడినట్లు తెలియజేయుచున్నది. నేడున్న అనేక మతశాఖలు యెరూషలేము తప్ప వేర్వేరు ప్రదేశాలలో స్థాపించబడినవి. గనుక ఈ మతశాఖల సంఘములను గూర్చి మనమేమనుకోవాలి? అవి క్రొత్త నిబంధనలో చెప్పబడిన క్రీస్తుసంఘము కానేరవు!



ఆదిమ సంఘము దైవాధికారముచే స్థాపించబడెనది (మత్తయి 28:18). ప్రభువు మరణించిన తరువాత మొదటి పెంతెకొస్తు దినమున, యెరూషలేములో అది స్థాపించబడెను (మత్తయి 16:18). దాని ఉనికి నిమిత్తమై సమస్తమును దేవుడు దానికి సమకూర్చెను. "తన మహిమను బట్టియు, గుణాతిశయమును బట్టియు మనలను పిలిచిన వాని గూర్చిన అనుభవజ్ఞానము మూలముగా ఆయన దైవశక్తి, జీవమునకును, భక్తికిని కావలసిన వాటినన్నిటిని మనకు దయచేయుచున్నందున దేవుని గూర్చియు, మన ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి నట్టియునైన అనుభవజ్ఞానము వలన మీకు కృపయు, సమాధానమును విస్తరించును గాక!" (2 పేతురు 1:2,3). సంఘము ఆయనలో సంపూర్ణ మైయున్నది (కొలస్స 2:10). సంఘము నిజముగా దైవిక ఆరంభము కలిగినదే.

**-ఎడ్‌మెల్లోటే**

## ఏదైనా వస్తువు సంపద యెట్లగును?

నేను బాలునిగా యున్నప్పుడు నేను నా మిత్రులు ఏదైనా విలువైన ఖజానా దొరుకునేమోయని పలుచోట్ల వెదికేవారము. ఆ కాలములో చిన్నతనములో మాకు చాల విలువైన వస్తువులు దొరికేవి. ఇప్పుడైతే అవి ఎందుకు పనికిరావు. గాని పిన్న వయస్సులో యున్న మాకు అవి ఎందుకు అంత విలువైన సంపదగా అగుపడెను?

మొదటిగా అది ఎక్కడ దొరికినదో చూడాలి. ఉదాహరణకు అది ఒక కాలువలోనో, నదిలోనో దొరికి యంటే, దాని కొరకు మేము ఈత ఈదుకొని ప్రయత్నించాలి. దొరికనదేదైనా మా యింటిలో యిదివరకే యున్నది కాదు. రెండవదిగా దాని విలువ యెట్టిది? దాని ఖరీదు ఎంత ఉంవడచ్చును? అది అరుదుగా యుండే వస్తువా? చిన్నపిల్లలుగా మాకు దొరికిన వస్తువులకు (గులక రాళ్ళు మొదలైనవి) మేము గొప్పగా

వెలకట్టేవారము. గాని పెద్దవారమైన తరువాత అవి పనికిరానివని తెలిసి పారవేసాము.

అయితే అన్నిటికంటే ప్రవశస్త మైన సంపద దేవుని కుమారుడైన క్రీస్తు ద్వారా మన కనుగ్రహింపబడుచున్న రక్షణయే. "అయినను అబలాధిక్యము మా మూలమైనది కాక దేవునిదై యుండునట్లు మంటిఘటములలో ఈ ఐశ్వర్యము మాకు కలదు" (2 కొరింథీ 4:7). ఏదైనా ఒక వస్తువు సంపద కావలెనంటే నాలుగు సంగతులు అవుసరము.

**ఆ సంపద దొరికినచోటు :** యేసే దానికి ఆధారము. ఆయన యొద్దనే ఆ సంపద యున్నవి. "దేవుని కృపవలన ఆయన ప్రతి మనుష్యుని కొరకు మరణము అనుభవించెను" (హెబ్రీ 2:9). ''ఆయన దేవుని స్వరూపము కలిగినవాడై యుండి దేవునితో సమానముగా నుండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచు కొనలేదుగాని మనుష్యుల పోలికగా పుట్టి దాసుని స్వరూపము ధరించుకొని తన్ను తానే రిక్తునిగా చేసికొనెను" (ఫిలిప్పీ 2:6,7). ఆయన తానే తన శరీరమందు మన పాపములను భరించుట ద్వారా మన కొరకు సంపద సమకూర్చెను (1పేతురు 2:24). ఆయన మృతులలో నుండి లేని తండ్రి యొద్దకు ఆరోహణుడై సువార్తయను ప్రశస్త సంపదను మనకనుగ్రహించెను. పాపులను రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది (రోమా 1:16). అదిమంటిఘటములైన మనుష్యులవశీ ప్రకటింపబడాలి.

**ఆ సంపద యొక్క విలువ :** మంటిఘటములైన మనలో యుంచబడిన ఐశ్వర్యమే మనదాయెను. దానిని సంపాదించుకొనిన వాని సంపద విలువ ఎంతోగొప్పది. "పిత్రుపారంపర్యమైన మీ వ్యర్ధప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా వెండి బంగారముల వంటి క్షయవస్తువుల చేత మీరు విమోచింపబడలేదు దాని అమూల్యమైన రక్తముచేత అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తము చేత విమోచింపబడితిరని మీరెరుగుదురు" (1 పేతురు 1:18,19).



**ఆది అరుదైన సంపద :** అది అరుదైనది. దాని వంటిది ఇంకొకటి లేదు. మంటిఘటములలో యున్న ఐశ్వర్యము ఎంత అరుదైనదంటే, ''క్రీసుత సువార్తను చెరుపగోరి మిమ్మును కలవరపెట్టువారు కొందరున్నారు'' (గలతీ 1:7). అయినను ఈ ఐశ్వర్యము ఎంత అరుదైనదంటే, పరలోకము నుండి వచ్చిన దూతయైనను దానికి వేరైనది బోధింపకూడదు (గలతీ 1:8,9).

**ఆ సంపద యొక్క అవుసరము:** అందరూ పాపముచేసినందున (రోమా 3:23), పాపము వలన వచ్చు జీతము మరణమైనందున (రోమా 6:23). మంటిఘటములైన వారిలోయున్న ఐశ్వర్యము, పాపులను రక్షించి పరమునకు చేర్చు శక్తి కలిగి యున్నందున అదిమానవులకు అత్యవుసరమైన వర్తమానము. ఈ వర్తమానము వినుట ద్వారా విశ్వాసము కలుగను (రోమా 10:17). గనుక ఈ వర్తమానము లేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము (హెబ్రీ 11:6). విశ్వాసము వలన ఒకడు మారుమనస్సు పొందుటకు దోహద పడును (అపో.కా. 17:30). క్రీస్తును ఒప్పుకొని (రోమా 10:9,10), పాపక్షమా పణ నిమిత్తము బాప్తిస్మము పొందును (రోమా 6:3-6). నీవు ఈ సంపదను కనుగొన్నావా?

-చార్ల్స్ రోజ్

## క్రొత్త నిబంధన సంఘము

తన సంఘమును స్థాపించెదనని యేసు చేసిన వాగ్దానమును అందరు ఎరుగుదురు. సంఘము, రాజ్యము అను పర్యాయపదములను ఆయన వినియోగించెను (మత్తయి 16:19). మార్కు 9:1లో ఆ రాజ్యము బలముతో వచ్చునని ఆయన చెప్పెను. పై నుండి శక్తి పొందు వరకు ఆయన శిష్యులు యెరూషలేములో యుండవలెనని ఆయన హెచ్చరించెను (లూకా 24:49). దేవుని మందిరము యెరూషలేములో స్థాపించబడునని యెషయా ప్రవచించెను (యెషయా 2:2,3). పెంతెకొస్తను పండుగ దినమున శిష్యులు యెరూషలేములో కూడుకొనిరి (అపో.కా. 2:1).

పెంతెకొస్తు యూదుల పండుగ అది ఎల్లప్పుడు వారములో మొదటి దినముననే వచ్చును (లేవీ 23:15, 16). ''పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు" అని ప్రభువు తన శిష్యులకు చెప్పారు (అపొ.కా. 1:8). పెంతెకొస్తునాడు పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చెను. అప్పుడు అపొస్తలులు ఆత్మ వారికి వాక్ శక్తిననుగ్రహించినకొలది అన్యభాష లలో మాటలాడసాగిరి (అపొ.కా. 2:4).

మనమీ వాక్యములను జమ చేసి చూచిన యెడల సంఘము యొక్క స్థాపనను గ్రహించుకోగలము 1) సంఘము/రాజ్యము శక్తితో (బలముతో) రావలసియుండెను. 2) క్రీస్తు యొక్క అపొస్తలులు యెరూషలేములో ఆ శక్తి పొందెదరు (లూకా 24:49). 3) పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చినప్పుడు వారు శక్తినొందెదరు (అపొ. కా. 1:8). 4) పరిశుద్ధాత్మ, పెంతెకొస్తు నాడు యెరూషలేములో వారికి మీదికి వచ్చెను (అపొ.కా. 2:1-4). 5) గనుక రాజ్యము / సంఘము పెంతెకొస్తునాడు స్థాపించబడెను.

శక్తి వచ్చినప్పుడు రాజ్యము వచ్చెను. పరిశుద్ధాత్ముడు వచ్చినప్పుడు శక్తి వచ్చెను. పెంతెకొస్తునాడు పరిశుద్ధాత్ముడు వచ్చెను. అపొ.కా. రెండవ అధ్యాయములో రికార్డు చేయబడిన రీతిగా సంఘము లేక రాజ్యము పెంతెకొస్తునాడు ఆరంభించబడెను. ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 2:41). మరియు అట్లు రక్షణ పొందుచున్న వారిని అనుదినము ప్రభువు సంఘముతో చేర్చుచుండెను (అపొ.కా. 2:47).

**పూర్తిగా స్థాపించబడియుండెను**

రాజ్యము ఇంకా రాలేదు. అది ఇంకా భవిష్యత్తులో యున్నదని కొందరు బోధిస్తారు. అయితే అపొ.పౌలు అప్పటికే రాజ్యనివాసులుగా యున్నవారిని గూర్చి చెప్పాడు (కొలస్స 1:13). హెబ్రీ 12:28లో "మనము నిశ్చలమైన రాజ్యము పొంది దైవకృప కలిగి యుందము" అని చెప్పబడినది. యెహాను తాను శ్రమలలోను, రాజ్యములోను పాలివాడను అని చెప్పాడు (ప్రకటన 1:9).

దేవుడు ఏమి సృజించినను మొదట్లో అద్భుతరీతిగా సృజించెను.



గాని తదుపరి దేవుని ప్రకృతి సూత్రమును బట్టి అది వ్యాప్తి చెందెను. అట్లే దేవుడు మొదటి పురుషుని స్త్రీని అద్భుత రీతిగా సృజించెను (ఆది.కా. 1:26; ఆది.కా. 2:21-23). అటు తరువాత మానవజాతి అంతయు దైవిక సూత్రమును బట్టి వ్యాప్తిజెందెను (ఆది.కా. 1:28; 4:1,2,23). ఆదాము హవ్వలు స్త్రీ పురుషులకు ఆదిమ మాదిరిగా సృజింపబడ్డారు (ఆది. 2:24; మత్తయి 19:4-6).

మొదట్టమొదటి క్రీస్తు సంఘము యెరూషలేములో అద్భుతశక్తితో ఆరంభించబడెను (అపొ.కా. 1:87; 2:1-4). తదుపరి స్థానిక సంఘముల స్థాపనకు అది ఆత్మీయ చట్టప్రకారమైన మాదిరియై యుండెను (అపొ.కా. 8: 4). దేవుని వాక్యమే రాజ్యము యొక్క విత్తనము (లూకా 8:11). ఎక్కడ దేవుని వాక్యము ప్రకటింపబడిందో, అక్కడ దేవుని వాక్యమునకు విధేయులైన వారు సంఘముగా స్థాపించబడిరి.

ప్రపంచమందంతటా సువార్త ప్రకటించుట ద్వారా సంఘము స్థాపించబడెను. ఏదైనా ప్రాంతమందు లేదా దేశమందు సంఘము స్థాపించబడాలంటే ఏదో యొక్క సంస్థ యొక్క అనుమతి అక్కరలేదు. మానవకల్పిత సంస్థల నుండి గాని ఏదో యొక మానవుని నుండి గాని అనుమతి అక్కరలేదు. మనం చేయవలసినదంతా మొదట్లో అపొస్తలులు సింపుల్‌గా దేవుని సువార్తను ఎట్లు ప్రకటించారో అట్లే ప్రకటిస్తే చాలు. అపొస్తలుల వలె క్రీస్తులోనికి ప్రజలను వాక్యమును బట్టి మార్చాలి (అపొ.కా. 2:37-47). అట్లు మార్పుజెందినవారు సంఘముతో చేర్చ బడతారు, సంఘ సభ్యులవుతారు. వారు దేవునిచే పిలువబడినవారి సమూహములో భాగమవుతారు (1థెస్స 2:13,14; 2థెస్స 2:14,15).

**సంఘము యొక్క తత్వము**

క్రొత్త నిబంధన సంఘము పరిశుద్ధులతోను, పెద్దలతోను, పరిచార కులతోను సమకూడి యుండును (ఫిలిప్పీ 1:1). ప్రతి స్థానిక సంఘము స్వయంపాలన కలిగి యుండును (1 తిమోతి 3:5). సంఘములపై ఏ మానవుడు అధికారిగా లేడు.

సంఘము యొక్క ఆరాధన

అంతయు యేసుక్రీస్తు అధికారము చొప్పునను, ఆదిమ సంఘము యొక్క మాదిరిని బట్టియు ఉండును. "వీరు అపొస్తలుల బోధయందును, సహవాస మందును రొట్టెవిరుచుట యందును ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి" (అపొ.కా. 2:42). వారు ఆత్మ సంబంధమైన పాటలు పాడిరి (ఎఫెసీ 5:19). క్రొత్త నిబంధన సంఘము ఆరాధనలో ఎన్నడు వాద్యములనుపయోగించలేదు.

సంఘ పాలనా పద్ధతి అంతయు స్థానికమే. అనగా ప్రతి స్థానిక సంఘము తన పనిని తాను చేసి కొనును. ప్రతి స్థానిక సంఘములోను పెద్దలు, పరిచారకులు యుందురు. వారి అర్హతలు 1తిమోతి 3లోను, తీతు 1లోను లిఖించబడియున్నవి.

**సంఘము యొక్క కృషి**

సంఘము యొక్క కృషి అంతయు నశించినవారిని వెదకి రక్షించుటయే (లూకా 19:10). తన శిష్యులు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి యని యేసు చెప్పెను (మార్కు 16:15). మరియు సువార్తను "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనొల్లని వానికి శిక్ష విధించబడును" (మార్కు 16:16). ఆదిమ సంఘము సువార్త ప్రకటిం చుచు సంచారము చేసిరి (అపొ.కా. 8:4). అపొ.పౌలు ఇంటింటా బోధించాడు (అపొ.కా. 8:12).

**క్రీస్తు సంఘము ఒక డినామినేషన్ కాదు.** అది డినామినేషన్లకు చెందినది కాదు. అది డినామినేషన్ల కంటే ముందు నుండే యున్నది. మనము దేవుని నమూనాను అంగీకరించి అవలంబించిన యెడల మనము కూడ డినామినేషన్లకు చెందిన వారము కాము. క్రైస్తవులన బడే వారు డినామినేషన్ల పేరులను విసర్జించి, క్రొత్త నిబంధన కాలములో క్రీస్తు శిష్యులు ఏ సంఘమునకు చెంది యుండిరో దానికే చెందాలని, క్రీస్తు నామమును ధరించుకొని ఆయనను ఘనపరచాలని, క్రొత్త నిబంధనకు ఏదేని కలుపుటగాని, దాని నుండి తీసి వేయుటగాని చేయురాదని మా విజ్ఞాపనయైయున్నది.

**-ఎలెన్ హయ్యర్స్**